క్లుప్తంగా

దీక్షాపరులకు అన్నదానం

నిజాంపట్నం: ప్రతిఒక్కరూ దైవకార్యకలాపాలకు కొంత సమయాన్ని కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని గోకర్ణమఠంలోని గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప, భవాని మాలదీక్షా పరులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇష్టదైవాన్ని కొలిచేందుకు కొంత సమయాన్ని కేటాయించడం మంచిపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాదం వాసుదేవ, గురుస్వామి శిఖినం శ్రీను, నాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కో ఆప్షన్ సభ్యుడు వీరయ్యకు నివాళి



రేపల్లె: మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు డొక్కు వీరయ్య మృతికి పలువురు నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందగా బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో సంతాప సభ నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి తెలిపారు.

నాయీ బ్రాహ్మణులపై దాడులను అరికట్టాలి

రెడ్డిపాలెం(పిట్టలవానిపాలెం): నాయీ బ్రాహ్మణులపై దాడులను అరికట్టాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు కోరారు. ఇటీవల హత్యకు గురైన మండల పరిధిలోని భవనంవారిపాలెం గ్రామస్తుడు ఇంటూరి జగదీష్ చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం నివాళులర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ జగదీష్‌ను హత్యచేసిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగదీష్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ పేదలకు రక్షణ కరువైందని ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో దళిత గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా ప్రభుదాసు, నాయకులు ఎస్.నీలాంబరం, ముత్తయ్య క్రాంతి, హరనాథబాబు, రజక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన గాయపడిన సుల్తానాబాద్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. తెనాలి మండలం సంగంజాగర్లమూడికి చెందిన చింతకాయల రామకృష్ణ, చేబ్రోలు మండలం వడ్లమూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఎకో అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. భార్య దివ్యశ్రావణి, తల్లి వెంకాయమ్మలతో కలసి బైక్‌పై తెనాలి వచ్చాడు. కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి తిరుగుప్రయాణంలో ఉండగా సుల్తానాబాద్ వద్ద వేగంగా వెళుతున్న గుర్తు తెలియని కారు వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లింది. దీంతో ముగ్గురూ ఒక్కసారిగా రోడ్డుమీద పడిపోయారు. గాయపడిన వీరిని వడ్లమూడిలోని వైద్యశాలకు తరలించారు. భార్యాభర్తలు దివ్య శ్రావణి, రామకృష్ణలకు శస్త్రచికిత్స చేసి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. వెంకాయమ్మ ఐసీయూలో చికిత్స పొందుతోంది. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. బుధవారం కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

మూడు లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గుర్తించి జరిమానా విధించారు. కొల్లిపర మండలంలో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మూడు లారీలు అధిక లోడుతో వెళుతుండడాన్ని గుర్తించారు. ఒక లారీకి రూ.ఏడు వేలు, రెండు లారీలకు రూ. ఎనిమిది వేలు చొప్పున జరిమానా విధించారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన

తెనాలి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.రవిబాబు కోరారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కాలేజిలో 'స్వీప్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఓటరుగా నమోదు, ఈవీఎంల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 17 ఏళ్లు నిండిన విద్యార్థుల వివరాలను సేకరించి, వారి ప్రాంత పరిధిలోని బీఎల్‌ఓలకు అందజేశారు. ఈ విధంగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టినట్టు రవిబాబు తెలిపారు. సామాజిక మాధ్యమాలతోనూ ఓటు నమోదుపై ప్రచారంతో అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. ఆర్ఐ యు.జాన్, నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి, వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- దుండివారిపాలెంలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



దుండివారిపాలెం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రాధాకృష్ణమూర్తి



కోనేటిపురం సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు



చంపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ మోహన్



చినపులివర్రులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్లపాలెం: గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. దుండివారిపాలెంలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని సర్పంచి పులుగు గోవిందమ్మతో కలసి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. తొలుత వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండా, సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. కోన మాట్లాడుతూ దుండివారిపాలెం పంచాయతీ పరిధిలో సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.12 కోట్లు వెచ్చించిందని చెప్పారు. గ్రామంలో రోడ్లతో పాటు మిగిలి ఉన్న సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని కోన హామీ ఇచ్చారు. సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా ప్రత్యక్షంగా లక్ష 63 వేల మందికి పరోక్షంగా 2.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని చెప్పారు. రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా గ్రామ వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేసిందని వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్ ఈ రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని పేదల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు తేవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పులుగు గోవిందమ్మ, ఎంపీటీసీ అక్కల వాణి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏత్ర అశ్వనీరెడ్డి, పార్టీ నాయకులు ఎం.పరమానందకుమార్, ఎం. శివారెడ్డి, ఎస్.భానుప్రసాద్, ఎ.శ్రీనివాసరెడ్డి, టి.సాంబశివరావు, పి.మునిచంద్రారెడ్డి, అసెంబ్లీ చీఫ్ మార్షల్ దుండి ఏడుకొండలరెడ్డి, ఈఓపీఆర్డీ శరత్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

చందోలు(పిట్టలవానిపాలెం): పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. చందోలు సచివాలయం -1 పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద వెల్‌ఫేర్ బోర్డు ఆవిష్కరించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసిన అనంతరం సభలో కోన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా లోటులో ఉన్నప్పటికి సీఎం వైఎస్ జగన్ ఎన్నికల హామీలను 98శాతం అమలు పరిచారని ఎమ్మెల్యే చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గౌరీదేవి విజయకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎస్కే బాజీ, వైస్ ఎంపీపీ డి.సీతారామరాజు, నాయకులు వీరయ్య, కరీమున్నీసా, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

రేపల్లె: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థిక పరిపుష్టి పొందుతున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని 22, 24వ వార్డులలోని సచివాలయ పరిధిలో ప్రజలకు బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పేదల కోసం సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సమీపంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోనేటిపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కోనేటిపురం(భట్టిప్రోలు): వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచి మోర్ల వెంకటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరి పాల్గొన్నారు. 'వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో నవరత్నాల్లో భాగంగా డీబీటీ, నాన్ డీబీటీ కింద లబ్ధిదారులకు రూ.23.49 కోట్లు సంక్షేమ లబ్ధి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి, పార్టీ నాయకులు టి.బాలాజి, ఎం.నాగబాబు, ఎం.నాగబాబు, ఏపూరి నాగు, పంచాయతీ కార్యదర్శులు టి.అనూరాధ, ఎ.చిన వెంకటేష్‌బాబు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు

కొల్లూరు: వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఎనలేని మేలు చేకూరుతుందని కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని చినపులివర్రు సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ రవిబాబు, కార్యదర్శి దానయ్య, జేసీఎస్ కన్వీనర్ ఎ.సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు డి.వెంకయ్య, బి.రవి, ఎం.రత్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.మోహన్‌రావు, వి.వెంకటేశ్వరరావు, ఎం.హైయర్‌బాబు, డి.శ్యామ్ పాల్గొన్నారు.

చంపాడులో...

చంపాడు(వేమూరు): సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ యల్లమాటి మోహన్ పేర్కొన్నారు. గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ బుక్‌లెట్లను అందించారు. కార్యక్రమంలో కార్యక్రమం సర్పంచి కూచిపూడి రత్న కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, దున్నా మేరీసుబాబు, మేరుగ రాధాకృష్ణ, సన్నీడే పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ వెంకయ్య

రేపల్లె రూరల్: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. మండలంలోని పెనుమూడి సచివాలయ కేంద్ర ఆవరణలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికంతో ఎవరూ ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదరికంతో విద్యార్థులు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను రూపొందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో అమలైన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచి దారం విజయ్, సచివాలయాల మండల కన్వీనర్ కాగితాల కృష్ణకిషోర్, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీ మోపిదేవి భూమిపూజ



నిజాంపట్నం: పల్లెసీమల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో కోటి రూపాయలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అందులో భాగంగా నిజాంపట్నంలో 460 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పు రోడ్డును నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని వివరించారు. శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, మార్కండేయులు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం



భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరం చేశారు. భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు, కొల్లూరు, వేమూరు మండలాలల్లో కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో కోతలు చేపట్టారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ నేపథ్యంలో రైతులు రైతులు హార్వెస్టర్‌లను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గంలో 95 వేల ఎకరాల్లో హార్వెస్టర్ ద్వారా వరి కోతలకు అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎకరా కోత కోయడానికి గంటన్నర వ్యవధి పడుతుంది. హార్వెస్టర్ గంటకు రూ.2,500 ఉండగా ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం కూలీలు కొరత ఉండటంతో రైతులు యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలుకు పైగా దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏఎస్ఎన్ ఓవరాల్ చాంపియన్

- 14వ సారి ఘనత
- బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్‌మెన్, స్ట్రాంగ్ విమెన్ అవార్డులు



కాలేజ్ జట్టు లిఫ్టర్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, పక్కన పీడీ శేషగిరిరావు

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి పురుషుల జట్టు అద్భుత ప్రతిభను చాటి ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్‌ను సాధించింది. 14వ పర్యాయం రోలింగ్ ట్రోఫీని స్వీకరించింది. ఈ జట్టులోని లిఫ్టర్లను బుధవారం సాయంత్రం కాలేజిలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని యూనివర్సిటీ వ్యాయామ కాలేజి ఈ పోటీలను నిర్వహించింది. 67 కిలోల విభాగంలో ముద్దా తిరుపతిరావు, 89 కిలోల విభాగంలో గండికోట సందీప్‌కుమార్, 96 కిలోల విభాగంలో అంబళ్ల కోమలకార్తీక్, 109 ప్లస్ కేటగిరీలో పాలేరు భార్గవ్‌రామ్ బంగారు పతకాలను సాధించినట్లు కాలేజి వ్యాయామ అధ్యాపకుడు/శిక్షకుడు డాక్టర్ నల్లక శేషగిరిరావు చెప్పారు. జట్టులోని అంబళ్ల కోమలకార్తీక్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్ మెన్ టైటిల్స్‌ను సాధించాడు. మహిళల విభాగంలో కాలేజికి చెందిన డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థిని తాడిశెట్టి రేణుక 71 కిలోల విభాగంలో పోటీపడి బంగారు పతకంతో పాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్ విమెన్ టైటిల్స్‌ను గెలుచుకోవటం మరో విశేషమన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాలేజి లిఫ్టరు అంబళ్ల కోమల కార్తీక్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బంగారు పతకాలతోపాటు స్ట్రాంగ్ మెన్ టైటిల్‌ను గెలిచాడు. మహిళల కేటగిరీలో తాడిశెట్టి రేణుక జూనియర్స్‌లో బంగారు పతకం, సీనియర్స్‌లో రజత పతకం గెలిచినట్టు వివరించారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు



వినయ్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: సాఫ్ట్‌వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్, ఆఫీసర్ ఇన్‌చార్జి బి. వినయ్ కుమార్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులకు లీప్ ఏ హెడ్ పేరుతో స్టార్టప్ అండ్ ఇంక్యుబేషన్ సంబంధిత అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రస్తుతం స్టార్టప్, ఇంక్యుబేషన్లకు అధిక ప్రాధాన్యత లభిస్తోందన్నారు. విద్యార్థులంతా విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా డెప్యూటీ డైరెక్టర్ డి. కిరణ్ కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ దానిపై పట్టు సాధించాలని తెలిపారు. మిలట్రానిక్ కంపెనీ సీఈవో లోకేష్ తన స్టార్టప్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వినయ్ కుమార్‌ను వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అభినందించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, సీఎస్ఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. బాలాజీ, ప్లేస్‌మెంటు అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సర్వో మేధ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంటును నిర్వహించిందని కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈసీఈ, ట్రిపుల్‌ఈ, మెకానికల్ విద్యార్థులకు ఆన్‌లైన్ అసెస్‌మెంట్ ఎగ్జామ్ నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఆగంతకుడు పరారైన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్‌కు చెందిన అద్దేపల్లి భవాని బుధవారం రైతుబజారుకు వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఓ ఆగంతకుడు భవానీ సమీపానికి వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో పతకాలు

తెనాలి: న్యూ మంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన రెండో జాతీయస్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే, ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో స్థానిక నెహ్రూ నికేతన్ బాలబాలికలు పతకాలను సాధించారు. అండర్-10 విభాగంలో డి.రుత్విక్ బంగారు పతకాన్ని, ఆర్.నవనీత్ సంతోష్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. అండర్-11 విభాగంలో కేవీఎస్ మోనిక, అండర్-14లో కె.జోషితలు కాంస్య పతకాలను సాధించారు. నిర్వాహకులు పంపిన ధ్రువపత్రాలు, పతకాలను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి విజేతలకు అందించి అభినందించారు.

ఫార్మసీ సూపర్‌వైజర్‌గా కృష్ణకుమారికి పదోన్నతి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఫార్మసీ విభాగంలో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణకుమారికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. ఆమెను గుంటూరు నుంచి ఒంగోలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ చేశారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆమెకు పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావుకు ప్రమోషన్ ఇచ్చి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజర్‌గా బదిలీ చేశారు. నెల్లూరు జీజీహెచ్‌లో పని చేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లుకు ఫార్మసీ సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ ఇచ్చి ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ చేశారు.

కాపులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి

రేపల్లె: రాజకీయ, సేవా రంగాల్లో కాపులు ముందడుగు వేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే కాపు సమారాధన కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ కాపు నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గం రాజకీయంగా తొలి నుంచి కాంగ్రెస్‌కు ఆ తరువాత వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం నాడు వంగవీటి రంగా నుంచి నేడు ముద్రగడ పద్మనాభం వరకు చేసిన దుర్మార్గపు చర్యలను కాపులు మరువలేరన్నారు. కూచినపూడి నియోజకవర్గంలో కాపుల ప్రతినిధిగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావును మాజీ ఎంపీ సింగం బసవపున్నయ్య రాజకీయాలలోకి తీసుకువచ్చారన్నారు. మోపిదేవికి కాపులు అండగా నిలిచి ఆయన విజయంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ దేవగిరి సాంబయ్య, మాజీ చైర్మన్ మల్లెల రామచంద్రరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమటా బాలాజీ, నాయకులు తూము నాగకోటేశ్వరరావు, రావూరి నాగేశ్వరరావు, అల్లంశెట్టి శ్రీనివాసరావు, జడల వాసు, ఐనాల సాంబశివరావు, పల్లగస్ పాల్గొన్నారు.

డిసెంబర్ 19, 20 తేదీల్లో బాలోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 19, 20వ తేదీల్లో మంగళగిరి మండలం యర్రబాలెంలోని డాన్‌బాస్కో హైస్కూల్లో జరగనున్న మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం (రెండో పిల్లల పండుగ) బ్రోచర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మొత్తం 42 రకాల అకడమిక్, కల్చరల్ పోటీలు బాలోత్సవంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తుళ్లూరు, రాజధాని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ పండుగలో పాల్గొనాలని కోరారు. ఉరుకుల, పరుగుల జీవితంలో పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించే తీరిక లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయని అన్నారు. మరోవైపు ఆట పాటలు, వ్యాయామం శారీరక శ్రమ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటీఎంసీ బాలోత్సవం గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షుడు వీవీ ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవం విజయవంతానికి ఇప్పటికే 150 పాఠశాలలకు బ్రోచర్లు అందచేశామని చెప్పారు. రెండ్రోజులపాటు జరిగే ఈ పిల్లల పండుగకు సుమారు 4వేల మంది పిల్లలు హాజరవుతారన్నారు. ఉపాధ్యక్షుడు యడ్ల బాలకృష్ణ, కార్యదర్శి ప్రగడా రాజశేఖర్, పి.శ్రీలక్ష్మి, జె.శేషయ్య, కోశాధికారి గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కర్రసాములో నగర విద్యార్థినికి బంగారు పతకం



గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ ట్రెడిషనల్ సిలంబం చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్రసాము పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 6వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీకృష్ణ సిలంబంలో బంగారు పతకాన్ని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఏ. నిహారిక విన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. చదువుతో పాటు విద్యార్థుల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తూ జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, సీనియర్ కో-ఆర్డినేటర్ దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.